44.

# దైవ పాదుకల నిజ స్థానము హృదయమే

సకలశాస్త్ర పురాణ సంగ్రహవేత్తయై
వేదంబులను నేర్చు విప్రుడైన
రక్తి ఏపారగ రమ్య హర్మ్యంబుల
రమియించు రాజచంద్రముడు నైన
రణరంగమందు పరాభూత రిపుడౌచు
వెల్గొందు జగదేక వీరుడైన
దారిద్ర్య దేవతా దాక్షిణ్యమున కుందు
దౌర్భాగ్య విభుడగు దాసుడైన
భక్తి లేనిచో ఎందుకు పనికి రాదు
భక్తి రహితుడగు జగద్భర్త కన్న
భక్తి పరుడగు దాసుడే వంద్యుడగును

తరువ తరువ పుట్టు తరువున ననలంబు
తరువ తరువ బుట్టు దధిని ఘృతము
తరువ తరువ బుట్టు తనువున తత్వంబు
ఉన్నమాట తెలుపుచున్న మాట

అనాది కాలము నుండి అనంతమైన జీవరాసులలో మానవుని యొక్క జన్మము ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. ఇట్టి పవిత్రమైన మానవ జన్మ లభించికూడా దివ్యత్వమును గుర్తించుకోలేని వ్యక్తిత్వము. ఇది అవ్యక్తమే అని చెప్పవచ్చు. భక్తులకు అనేక విధములైన కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములు అశాంతి కూడా వెంటాడుతూ ఉంటాయి. విలువైన వజ్రమునకు అనేక కోతలు కోసినప్పుడే దానికి అనంతమైన విలువ అభివృద్ధి అవుతుంది. అదే విధముగనే మానవత్వములోని దివ్యత్వము సాక్షాత్కారించుకోవలెనన్న అనేక విధములైన కడగండ్లకు గురికావలసి వస్తుంది. కానీ భక్తి

srisathyasaivacharamrutam

మరువకూడదు.

**భక్తి రేవ పరమార్థదాయిని భక్తి రేవ భవమోహనాశిని**
**భక్తి రేవ పరవేదన ప్రదా భక్తి రేవ పరమమోక్షకారిణి**

ఎన్ని బాధలు సంభవించినప్పటికిని, ఎన్ని నిందలు మోసినప్పటికిని, ఎన్ని నిష్ఠూరములో చిక్కుకున్నప్పటికి భక్తి అనే రక్షణ అనేక విధములుగా తోడునీడై ఉంటుంది. తమిళనాడు నందు గొప్ప ప్రఖ్యాతిగాంచిన రాజ్యము పాండు సామ్రాజ్యము. ఆ రాజ్యమునందున్న రాజునకు అశ్వములంటే ప్రీతి. ఆ ప్రీతి వల్ల తన మంత్రిని పంపించి, ధనమును, తగిన పరివారమును చేకూర్చి మంచి అశ్వమును తీసుకొని రమ్మని పంపించాడు. ఈ పాండు సామ్రాజ్యమునకు అధిపతి యైన రాజు అనేకమంది యువకులను చేర్చుకొని, యువకులనే మంత్రిగా నియమించుకొని, యువకుల వల్ల పెద్దలకు ఆదర్శాన్ని అందించే నిమిత్తమై తర్ఫీదు చేస్తూ వచ్చాడు. ఈ మంత్రి 'పెరుందార్రై' అనే గ్రామము వెళ్లాడు. అక్కడికి చేరేటప్పటికి అక్కడ సమీపంలో బాల యోగీశ్వరుడు అనే మహనీయుడు ఉన్నాడు. ఆ సాయంకాలము కాలము వ్యర్థము చేయకూడదని, ఆ యోగీశ్వరుడు ప్రసంగించే ప్రదేశమునకు ప్రవేశించి ఆ ప్రసంగాన్ని పూర్తిగా విన్నాడు. ఆ ప్రసంగము విని మైమర్చిపోయాడు. ఇలాంటి మహనీయులు ఈ జగత్తునందున్నారా అనే సందేహము కలిగిన ఈ మంత్రికి ధృఢమైన విశ్వాసము గల్గి అతనిపై నమ్మకమును అభివృద్ధి పరచుకున్నాడు. 'ఎందరో మహానుభావులు అందరికి వందనములు' అన్నాడు త్యాగరాజు. పవిత్రమైన భారతదేశమందు, అనంతమైన జన సంఖ్యయందు ఈ పవిత్రమైన మహర్షులు కూడా అనేకమంది అభివృద్ధి అవుతూ వచ్చారు. ప్రాచీనకాలము నుండి భారతదేశము ఆధ్యాత్మిక తత్త్వ ప్రభావముతో అన్ని దేశములకు సుస్థిరమైన శాంతి భద్రతలను చేకూరుస్తూ వస్తుంది. భారతదేశము ఆధ్యాత్మిక తత్త్వమునందు అన్ని దేశములకు మించిన ఉపాధ్యాయ స్థాయిని అలంకరించినది. నిత్యము తాను వచ్చిన పని ఏమిటో తన రాజు యిచ్చిన ఆజ్ఞ ఏమిటో దాన్ని మరచిపోయి ఈ ప్రసంగములు వింటూ, ఈ ఆనందములో మైమర్చి నిరంతరము దైవచింతనలో మునిగిపోయాడు. స్థానబలము, తనబలము, ధనబలము, సర్వబలములతో కూడిన ఆ ప్రదేశమునందు స్థానబలమును కూడా చూడాలని కొంత

srisathyasaivachanamrutam

పరిచయము చేసుకున్నాడు. అత్యంత సమీపంలో ఈశ్వరుని గుడి పాడుపడినదిగా కనిపించింది. అశ్వములకై తీసుకువెళ్లిన ధనమును, ఆ మందిర నిర్మాణమునకై వినియోగించి, ఆ శిథిలమందిరాన్ని పవిత్రమైన మందిరంగా తీర్చిదిద్దాడు. ఈ విధంగా పెరుందురైలో నిల్చి మంత్రిగారు ఈవిధముగా ధనము వినియోగిస్తున్నారనే వార్త మహారాజుకు తెలిసింది. ఈ పాండ్యదేశము మహాభక్తి ప్రపత్తులతో కూడినది. పాండ్యదేశ మహారాజు చాలా భక్తి ప్రపత్తి గలవాడే. కానీ రాజాజ్ఞ ఉల్లఘించాడనే కోపముచేత సిపాయిలను పంపించి అతన్ని తీసుకుని రమ్మన్నాడు. ఈ వచ్చిన మంత్రి మహారాజు అడిగిన ప్రశ్నలకు సరైన జవాబు చెబుతూ వచ్చాడు. ఈ అశ్వములకై తీసుకువెళ్లిన ధనము ఏవిధముగా వినియోగించావు అడిగాడు. 'రాజా! భగవంతుని నిమిత్తమై వినియోగించాను' అన్నాడు. అంతయు భగవంతుని వరప్రసాదమే. తన యొక్క ప్రసాదము తనకే వినియోగించాను అన్నాడు. నేను వినియోగించటమే కాదు అతనికి అర్పితము చేశానన్నాడు. కానీ ఒక పని నిమిత్తమై నియమించిన ఈ ధనమును మరొకపనికి ఉపయోగపెట్టటము న్యాయమా? అన్నాడు రాజు. నేను ప్రాకృతమైన, భౌతికమైన, లౌకికమైన పనులకు ఉపయోగించలేదు. దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన దైవత్వమునకే సర్వము అర్పితము గావించాను అన్నాడు. ఇంత కఠినమైన జవాబు చెప్పటం చేత పాండ్యరాజుకు కోపం వచ్చింది. ఇతన్ని తీసుకువెళ్లి చెరసాలలో ఉంచండి అన్నాడు. ఈ మంత్రిని చెరసాలలో పెట్టారు. ఆ చెరసాలలో ఉండినంత కాలము ఈ యోగీశ్వరుడు చెప్పిన ప్రబోధలు నిరంతరము చింతిస్తూ దానిపై కొన్ని శ్లోకములు వ్రాస్తూ వచ్చాడు. ఎన్నియో దినములు ఎన్నియో శ్లోకములు వ్రాస్తూ వచ్చాడు. దీనికి "తిరువాచకము" అని పేరు పెట్టాడు. పవిత్రమైన పఠన అని. పవిత్రత యిందులో యిమిడి ఉంటుంది. తెలుగులో దీనిని శతకము అంటారు. దీనినే వాచకము అన్నారు తమిళములో. ఈవిధంగా వ్రాసి నిరంతరము కాలమును పవిత్రము గావించుకుంటూ చెరసాలలో కాలమే తెలియకుండా ఆనందమును అనుభవిస్తున్న వ్యక్తిని ఒకనాడు మహారాజు పిలిపించాడు. అతని తేజస్సు చాలా ప్రకాశిస్తూ ఉండినాది. మహారాజుకే ఆశ్చర్యము వేసింది అతన్ని చూచి. చెరసాలలో ఉన్న వానికి ఈవిధమైన కళ ఎలా వచ్చింది? నిరంతరము దైవచింతన చేయటం చేత ఆ

sri sathyasai vahini

ప్రతిబింబమే అతనియందు ఆవిర్భవిస్తూ వచ్చింది. అతనే మాణిక్యవాచకర్. అతను వ్రాసిన కీర్తనలన్నీ తిరువాచకం. అతను వ్రాసిన ఒక్కొక్క శ్లోకములో వేదశాస్త్ర, యితిహాస పురాణములన్నీ ఇమిడి ఉంటున్నాయి. తమిళ దేశములో అనేకమంది మహనీయులు ఆనాటి కాలమునుండి నేటివరకు అభివృద్ధి అవుతూ వస్తున్నారు. ఈ తమిళనాడులోనున్న దేవాలయములు, తమిళనాడులో నున్న దివ్యత్వములు మరి ఏదేశమందు కానరావు. తెల్లవారి లేచినది మొదలుకొని నాదములు వినటము, దేవాలయములకు వెళ్లటం, నమస్కారములు చేయటం క్షమాపణ వేడుకోటం ఈవిధమైన సాధనలచేత తమిళనాడు ప్రజలంతా దివ్యత్వములో కాలమును పవిత్రము గావించుకుంటూ వచ్చారు. తిరుక్కళై అనేవాడు ఉండేవాడు. అతను నేత పని చేసేవాడు. అతను దినమునకు ఒక్క చీరను నేసి, దానిని బజార్లో పెట్టుకొని, దానిని అమ్మి దానిని నుండి వచ్చిన ధనము తన కుటుంబానికి వినియోగించుకునేవాడు. ఎక్కడ మంచి ఉంటుందో అక్కడ చెడ్డకూడా ఆవిర్భవిస్తుంది.

**మంచి చెడ్డలు రెండును కలిసియుండు**
**దీనిని విడదీయ నెవని వశము కాదు**
**సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము**
**కష్టంబు ఫలించెనేని సుఖంబటంద్రు**

ఈ కష్టసుఖములు, బాధలు, ఈ ఆనందములు యివన్నీ ఒకదానికొకటి తోడూ నీడై ఉంటాయి. బింబ ప్రతిబింబముల వలే ఈ మంచి చెడ్డలు కలసి ఉంటాయి. అలాంటి పరిస్థితియందు ఆ గ్రామములోనే ఒక శ్రీమంతుని కుమారుడు ఊరకే బజారులో తిరుగుతుండేవాడు.

**ధనమెచ్చిన మదమెచ్చును**
**మదమెచ్చిన దుర్గుణంబులు హెచ్చు**
**ధనముడిగిన మదముడుగును**
**మదముడిగిన దుర్గుణంబు మానును.**

శ్రీమంతుని కుమారుడు ఆ వ్యక్తి దగ్గరకు వచ్చి అయ్యా! ఈ చీర ఎంత? అన్నాడు. ఆ

sri sathyasaivachanamrutam

వ్యాపారి చెప్పాడు. బాబు ఈ చీర వెల 4 రూపాయలు అన్నాడు. అప్పుడు పదార్థములంతా cheap. ఈనాటి కాలముతో పోల్చుకుంటే నాలుగు వేల రూపాయలయ్యేది. ఆ పిల్లవానికి దుడుకుతనమునకు పుట్టినిల్లు, పెట్టినపేరు. చీరను తీసాడు తీసుకునేవాని వలె సగము చించాడు. దీని వెల ఎంత అన్నాడు. దీనికి రెండు రూపాయలు అన్నాడు. ఈ పిల్లవానికి పరివర్తన వచ్చింది. ఇంత విలువైన చీరను నేను చింపినా కూడా నాపైన ఏమాత్రము కోపపడలేదు. నేను ఈవిధంగా అవమానపరచినా యితనియందు ఏమాత్రం ఉద్రేకము కలుగలేదు అని చాలా ఆశ్చర్యపడి ఆ యొక్క వ్యాపారికి నమస్కారము చేసి 'అయ్యా నేను చేసింది చాలా తప్పు. నా ధనబలము చేత ఈ మదబలము పెరిగి ఈ మదబలముచేత దుర్గుణాలు బలపడి ఈ దుశ్చేష్టలకంతా నేను పాల్పడ్డాను. నన్ను క్షమించు' అని చెప్పి తండ్రి దగ్గరకు వెళ్లి ఆ చీరకు తగిన వెల తీసుకువచ్చి పాదములవద్ద పెట్టి నమస్కరించాడు. అతనే తిరుక్కళై.

ఈవిధమైన అనేకమంది మహనీయులంతా ఈ తమిళ రాజ్యములో ఆదర్శవంతులై ప్రత్యేకమైన నవీన వేదాన్ని సృష్టిస్తూ వచ్చారు. కానీ దురదృష్ట వశాత్తూ ఈనాడు ఆ తమిళదేశ ప్రభుత్వము యిలాంటి మహనీయుల తత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. కానీ వాళ్ల విగ్రహాలు బీచ్‌లో పెట్టి చూపుతున్నారు. విగ్రహాలు కాదు ప్రధానము. వారి బోధనలు చాలా ఆధారము. పవిత్రమైన సూక్తులు మనకు ఆధారము. సూక్తులను ఆచరణలో పెట్టి ఆనందించటము మన యొక్క కర్తవ్యం. మానవశరీరము అంగములతో కూడినది. కాళ్లు, చేతులు, ముక్కు, చెవులు, నోరు శరీరానికి అంగములు. ఈ శరీరము సమాజమునకు అంగము. సమాజము మానవత్వానికి అంగము. మానవత్వము ప్రకృతికి అంగము. ప్రకృతి పరమాత్మకు అంగము. భగవంతునికి అంగమైన ప్రకృతిని మానవత్వము అనే శక్తిని కాపాడుతూ వచ్చింది. అదియే మానవతా విలువ. అదియే సత్యంవద, ధర్మం చర. సత్యధర్మములచేత ఆధారపడినదే మానవత్వము. ఈ మానవత్వము సొసైటీలోపల ప్రధానంగా తీసుకోవాలి. వ్యక్తి లేకపోతే సొసైటీయే లేదు. సొసైటీయే లేకపోతే దేశమే లేదు. కాబట్టి సొసైటీకి వ్యక్తియే ప్రధానమైనవాడు. ఈ వ్యక్తికి అంగములే ఆధారమైనవి. కనుక ఉన్నటువంటి అంగములన్నీ సత్ప్రవర్తనలో ప్రవేశపెట్టి సత్కర్మలు ఆచరించాలి. చేతులతో

srisathyasaivahini.org (watermark)

మంచి పనులు చేయాలి. దైవము యొక్క ప్రసాదములే హస్తములు. కన్నులతో మంచి పవిత్రమైన దృశ్యములే చూడాలి. ఈ కర్ణములచేత పవిత్రమైన శబ్దములే మనం శ్రవణం చేయాలి. నాలుక చేత పవిత్రమైన వాక్కులే ఉచ్ఛరించాలి.

**జిహ్వే రసజ్ఞే మధురప్రియేత్వం సత్యంహితం త్వాం పరమం వదామి**
**ఆవర్ణయేథాం మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.**

అన్నాడు మాణిక్య వాచకర్. ఓ అంగములా నీవు పవిత్రమైన కార్యములలో ప్రవేశించు. చెడ్డనిచూడవద్దు. చెడ్డవి పలుకవద్దు. చెడ్డ వినవద్దు. చెడ్డవి చేయవద్దు. చెడ్డ తలవవద్దు.

See no evil, see what is good
Do no evil, do what is good
Talk no evil, talk what is good
Hear no evil, hear what is good
Think no evil, think what is good
This is the way to God

ఇదియే మానవత్వానికి పవిత్రమైన విలువలు. శరీరమాద్యంఖలుధర్మసాధకం. ఈ దేహము మంచిపనులు చేయటానికే అందించాడు భగవంతుడు. భగవంతుడు అందించిన ఈ దేహమును దుర్వినియోగం ఎందుకు చేసుకుంటున్నావు? అదే మాణిక్యవాచకర్ చెప్పాడు.

**ఏ హృదయంబు నొసంగితొ ఈశ నాకు**
**మగిడిదానినే యర్పింతు మహితమూర్తి**
**పరగవేరేమిదెత్తు నీ పూజకొరకు?**
**అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు**

అన్నాడు. దీనికంటె అర్పితము మరొకటి చేయలేను. ఈ heart కూడా నీవు ఇచ్చినదే. ఈ heart చేసేపని నీవు కల్పించినదే. సర్వము నీవు యిచ్చినది నీకే అర్పితము చేస్తున్నాను అన్నాడు. ఈనాటి మానవుడు ఈ పవిత్రమైన భావములను మానవుని హృదయములో ప్రవేశింపక తుచ్ఛమైన భావములచేత అనిత్యమైన వాంఛలచేత, అసత్యమైన పలుకుల చేత, అనిత్యమైన జీవితము గడుపుతూ వస్తున్నాడు. కనుక ఆనాటి మహనీయులు ఏవిధంగా

srisathyasaivachanamrutam

చెబుతూ వచ్చారు. శంకరాచార్యులవారు తమిళదేశమునకు ప్రక్కదేశమే కేరళ. అక్కడనే ఆదిశంకరులవారు ఆవిర్భవించారు.

**అస్థిరం జీవనం లోకే అస్థిరం యవ్వనం ధనం**
**అస్థిరం దారాపుత్రాది సత్యం కీర్తిద్వయం స్థిరం.**

సత్యం కీర్తి ఈ రెండే మనకు శాశ్వతమైనవి. మంచిపేరు తెప్పించుకో. సత్యమును ఉచ్చరిస్తూ రా. సత్యాన్ని నీవు అనుసరిస్తూ పో. సత్యమే నీ యొక్క సర్వస్వము.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునందణగె సర్వ సృష్టి**
**సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధ సత్వమిదియె చూడరయ్య.**

జగత్తంతయు సత్యము నుండే ఆవిర్భవించింది. తిరిగి సత్యమునందే జీవించి ఉండేది. సత్యమునందే అణగిపోతున్నాది.

**నీటియందె పుట్టి నీటియందె నిలచి**
**నీటియందడంగు నీటి బుడగ**
**నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు**

నీటియందు పుట్టిన బుడగ నీటియందే అర్పితమైపోతున్నాది. కానీ మానవుడు అమృతము నుంచి పుట్టి అసత్యములోపల అంత్యమవుతున్నాడు. అసత్యములో లీనమైపోతున్నాడు. ఇది మానవత్వానికి సార్థకతే కాదు. ఇట్టి సార్థకత లేని జీవితము గడిపి ప్రయోజనము ఏమిటి? విద్యలను అభ్యసిస్తున్నారు. ఎన్నో విద్యలు నేర్చుకున్నారు. ఎన్నో విధములైన తెలివితేటలు పెంచు కుంటున్నారు. కానీ ప్రయోజనం ఏమిటి? దీన్ని సమాజమునకు ఆదర్శప్రాయంగా నిరూపించాలి. మన విద్యలు ప్రతి ఒక్కటి వీధివీధికి, వాడవాడలకు అభ్యాసం చేసి ఆచరణ చేయాలి. ప్రచార ప్రబోధ నిమిత్తము విద్యలు నేర్చినవారుగానీ కేవలం ధన సంపాదన కోసం కాదు. ధర్మార్జన నిమిత్తమై విద్యలు గానీ ధనార్జన నిమిత్తమై కాదు. **"ధర్మమూల మిదం జగత్"**. జగత్తతంతయు ధర్మమూలమైనది. "ధర్మం నాస్తి

sri sathyasai vachanamrutam

పరోధర్మ". దీనికంటె మించినది మరొకటి లేదు. ధర్మమే మన ప్రధానమైన స్వరూపము. సత్యమే మన నిజమైన ఆకారము. శాంతమే మన దివ్యమైన తత్వము. ఈ స్వరూపమును మనం ధరించాలి. ఈ పవిత్రమైన మానవజీవితాన్ని ఏవిధంగా గడుపుతున్నాము. మన దేహము అనేక అంగములతో కూడినది అని చెప్పుకున్నాం. ఈ సృష్టి కంటె ఆధారమైనది ప్రత్యేకం కాదు. సృష్టికంటె మన దేహము ప్రత్యేకము కాదు. సృష్టిలో మన దేహం అంతర్భాగమైనది. అంతర్భాగమైన ఈ దేహాన్ని అనిత్యం అశాశ్వతమైన మార్గములో ప్రవేశపెడుతున్నారు. దీనినే భగవద్గీత యందు

**"అనిత్యం అసుఖం లోకం ఇమం ప్రాప్య భజస్వమాం".**

ఇదంతా అనిత్యం అసుఖం. సుఖములేదిక్కడ మనకు. ఉన్నదని అనుకుంటున్నారు చాలామంది. క్షణభంగురమైనది ఈ దేహం.

**మాకురు ధన జన యవ్వన గర్వం హరతినిమేషాత్కాల సర్వం.**

ఇదంతా పెద్ద గర్వంగా భావిస్తున్నాం. క్షణికమైనది ఈ జగత్తు. ఈ జీవితం క్షణభంగురమైనది. అనిత్యమైనది. కీర్తిరహితమైనది. ఇలాంటి దానిని ఈవిధంగా అనుసరించటమా? కాదు కాదు. సరైన మార్గములో ప్రవేశింపజేయాలి ఈ జీవితాన్ని. దేహము భూమిపైన నడుస్తున్నది. భూమిపై జీవిస్తున్నది. అయితే గొప్పవారిని స్వాగతము చేసినప్పుడు చెడ్డవారిని కూడా స్వాగతము చేయవలసి వస్తుంది. ఎందుకోసం? మన దివ్యత్వాన్ని గుర్తించుకునే నిమిత్తము సుఖదుఃఖములు సమత్వమని బోధించే నిమిత్తము వారిని కూడా ఆహ్వానించవలసి వస్తుంది. మహనీయుని ముఖము తేజస్సుగా ఉంటుంది. మహనీయుని ఇంటికి ఆహ్వానము చేసినప్పుడు మహనీయా! మీ తేజోవంతమైన ముఖము లోపలికి పంపండి అంటే తాను మొదట పాదమును పంపుతాడు తరువాత ముఖము పంపుతాడు. పాదములు ముందు పెట్టిన తర్వాతనే ముఖము వెనుక వస్తుంది. ఈనాటి లోకములో ముఖము చాలా పవిత్రమైనది. పాదములు చాలా అపవిత్రమైనవిగా భావిస్తున్నారు. పాదదర్శనమే పాపనాశనం అన్నారు. పాదములు అంత పవిత్రమైనవి. పవిత్రమైన దేహమును పాదములే గొనిపోతున్నాయి. పాదములే లేకున్న పవిత్రమైన

దేహములోపల ప్రవేశించదు. కనుక పవిత్రమైన సర్వేశ్వరమైన ఈ శరీరమును పాదములే లోనికి గొనిపోతున్నాయి. కనుక పాదములు చాలా ప్రధానమైనవి. ఇట్టి పాదముల స్వరూపాన్ని మనం చక్కగా గుర్తించుకోవాలి. ఈ పాదములు ఎక్కడ ఉంటున్నాయి. హృదయ పీఠముపై ప్రతిష్ఠ చేసుకోవాలి. అపవిత్రమైన దేహముతో కాదు. హృదయమందిరము భగవంతుని మూలస్థానము. ఆ temple లో పాదుకల స్వరూపాన్ని ప్రతిష్ఠింప చేసుకోవాలి. భగవంతుడా! నీవు నా హృదయవాసి. నా హృదయంలో నీవు ప్రవేశించి ప్రతిష్ఠ అయిపో. తిష్ఠామి నారదా అని చెప్పలేదు. ప్రతిష్ఠామి నారదా అన్నాడు. కేవలం ఉత్సవ విగ్రహాలు కాదు. ప్రతిష్ఠ చేయవలసిన స్థానం యిది. అలాంటి ప్రతిష్ఠ చేయవలసిన ఈ పాదములను బాహ్యముగా ఆరాధన చేయటము ప్రారంభంలో ప్రధానమైనదే. ఈ విధంగా మనం ఆరాధన చేస్తూ చేస్తూ రాగా అక్కడ ప్రతిష్ఠ అయిపోతుంది. నారదుడు ప్రశ్నించాడు. 'నారాయణా! నాకు అనేక సమస్యలు అడ్డు తగులుతుంటాయి. ఇలాంటి పరిస్థితిలో నేను దర్శనానికి వస్తుంటాను మీరు ఎక్కడ ఉంటారో ఏమిటో నాకు తెలియదు. కైలాసములో ఉంటారా? స్వర్గములో ఉంటారా? వైకుంఠములో ఉంటారా అన్నాడు. 'నారదా! నా permanent ఎడ్రసు చెబుతాను రాసుకో అన్నాడు.

**"మద్భక్తాః యత్రగాయన్తి తత్ర తిష్ఠామి నారద"**

నా భక్తులు హృదయములో నన్ను ఆరాధన సల్పుతుంటారో అక్కడే నేను ప్రతిష్ఠ అయి ఉంటాను. ఈ కైలసము, స్వర్గము, వైకుంఠము బ్రాంచి ఆఫీసులు. భగవంతుడు ఎక్కడో బయట ప్రదేశములందు లేడు. మన హృదయమునందే ఉంటున్నాడు. మన హృదయము ఈ భౌతికమైన heart కాదు. హృత్+దయ= హృదయ. కరుణతో కూడినదే హృదయము. ఈ compassion సర్వత్రా ఉంటున్నాది. హృదయము లేని స్థానమే లేదు. కాబట్టి సర్వత్రా తానే ఉంటున్నాడు. అలాంటి పవిత్రమైన స్థానములో **భగవంతుని స్మరించాలంటే ఎక్కడో మనం పోనక్కర లేదు. నిన్న పండితులందరు చెప్పారు. తదేవలగ్నం సుదినం తదేవ తారాబలం చంద్రబలం... తదేవలగ్నం అంటే అర్థము ఏమిటి? ముహూర్తము వ్రాసి పెట్టినది కాదు. ఎక్కడ అనుకుంటామో అదే మంచి లగ్నము. మనము తలచినదంతా**

sri sathyasai vahini vacharamrutam

**పవిత్రమైన కాలమే. భగవంతుడు కాలస్వరూపుడు. కాలనియమితుడు. కనుకనే కాలాయనమః, కాలకాలాయ నమః, కాలదర్ప దమనాయనమః, కాలాతీతాయ నమః, కాలస్వరూపాయ నమః, అంతా కాలస్వరూపము అతనిది. కనుక Time is God. Don't waste time. Time waste is life waste. తదేవలగ్నం యిది ఒకరు పెట్టిన లగ్నం కాదు. ఎప్పుడు దైవచింతన చేద్దామనకుంటామో అదే లగ్నం. అదే సరైన లగ్నం. దైవచింతనతో ఏ ముహూర్తములో స్మరించు అదే మంచిలగ్నం. ఇలాంటి పవిత్రమైన దివ్యత్వము లోపల మానవుడు ప్రయత్నం చేయకుండా పోతున్నాడు.** అన్ని విధములైన అనుకూలములు మానవునికి ఉన్నాయి. పవిత్రమైన బుద్ధి ఉన్నాది. పవిత్రమైన చిత్తము ఉన్నాది. పవిత్రమైన భావము ఉన్నాది. పవిత్రమైన సంకల్పాలు ఉన్నాయి. కానీ ఉండికూడా తాను సరైన స్థానము చేరలేక పోతున్నాడు. ధృఢమైన సంకల్పము కావాలి. గరుడ ఉన్నాడు. తన రెక్కలున్నాయి. తాను ప్రయత్నం చేస్తే కొన్ని మైళ్లు ప్రయాణం చేస్తాడు గరుడ. కానీ తనకు యిష్టము లేకపోతే ఒక్క యించైనా ముందుకి జరగలేడు. చిన్న చీమ ఉంది. ప్రయత్నం చేస్తే మైళ్ల దూరం ప్రయాణమవుతుంది. ఎప్పుడు చూచినా యిది ప్రయాణం చేస్తూనే ఉంటుంది. అదియే దైవ హృదయములో పోల్చబడింది. త్యాగరాజు చెప్పాడు. "చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమ మీర వెలసియుండే బిరుదు వహించిన రామా నన్ను బ్రోవరా"అన్నాడు. చీమలో ఉన్నావు, బ్రహ్మలో ఉన్నావు, శివకేశవులలో ఉంన్నావు, సర్వత్రా నీవున్నావు. నీవు లేని స్థానము నీది కాని నామము లేదు. కానీ ఈనాడు భౌతిక భ్రాంతులలో మునిగిన మానవుడు బ్రహ్మ ప్రత్యక్షమైతే కన్నులు మూసుకొని నమస్కారం చేస్తాడు. చీమగా వచ్చి కుడితే తక్షణమే చంపివేస్తాడు. బ్రహ్మలో, చీమలో ఉండిన దైవత్వాని ఎట్లా నీవు చంపుతున్నావు.

**"మనస్యన్యత్, వచస్యన్యత్, కర్మణ్యన్యత్ దురాత్మనాం"**

దైవం సర్వత్రా ఉన్నాడంటున్నాం. చీమలో ఉంటున్నపుడు చీమను ఎందుకో చంపటం. ఇంత పెద్ద మనిషిని అంత చీమ కుడితే నీకు ఏమి బాధ. చీమకుట్టిన బాధ నీవు సహించుకోలేక పోతున్నావా? ఇంత బలహీనుడవు నీవు ఏవిధంగా సాధించగలవు? కాదు కాదు. ఈనాటి మానవుడు ఆధునిక యుగములో దినదినమునకు అతి బలహీనుడై



srisathyasaivahini.org

పోతున్నాడు. ఎంత బలహీనం. కరచటం కూడా లేదు. చిన్న దోమ వచ్చి వాలుతుంది ముక్కుపైన. మొట్టమొదట శాంతంగా అట్లా విసురుతాడు. దోమకు లక్షణమేమంటే తిరిగిరావటం దాని స్వభావం. తిరిగి రెండవసారి వస్తే జోరుగా అంటాడు. మూడవసారి ముక్కుపైన వాలితే టక్కున చంపేస్తాడు. చూశారా! మానవుడు చిన్న దోమ వాలితే సహించుకోలేని బలహీనుడై పోయాడు. మన ప్రాచీన మహర్షులందరు గంటలు గంటలు, దినములు దినములు కొన్ని సంవత్సరములు తపస్సు చేస్తూ వచ్చారు. పాములు సంచరించినా, తేళ్లు సంచరించినా ఏవిధమైన ఆకలిదప్పులు వేసినా ఏమి చలించేవారు కాదు. దీని అంతరార్థము ఏమిటి? ఈనాటి మానవులందరు దేహాభిమానాన్ని అమితంగా పెంచుకుంటున్నారు. ఆత్మాభిమానము పెంచుకున్నప్పుడే దేహాభిమానము యొక్క బాధ్యత ఏమాత్రం లెక్కచేయము. ఈ విధమైన త్యాగమునకు పూనుకోవాలి. అదియే నకర్మణా, నప్రజయా, ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః. ఈనాటి మానవులలో టార్చివేసి వెతికినా త్యాగం కనిపించటం లేదు. బయట చెప్పులు విడిచి లోపలకు వచ్చి కూర్చుంటారు. కూర్చొని భజన చేస్తుంటారు మనస్సు చెప్పులపై ఉంటుంది. ఇదే పరిస్థితిలో రామకృష్ణ పరమహంస చక్కని ప్రబోధలు చేస్తూ వచ్చాడు ప్రతి సాయంకాలం. ప్రబోధలు చక్కగా సల్పుతున్నాడని రాణి రాసమణి, టెంపుల్ యజమానురాలు వచ్చి జనంలో కూర్చుంది. రాణి రాసమని ఈ temple అధికారిణి కాబట్టి పెద్దస్థానము ఇచ్చారు ఆమెకు. చాలా ఆనందముగా వింటున్నారు రామకృష్ణుని బోధలు. కానీ ఉన్నట్లు ఉండి రామకృష్ణుడు లేచాడు. రాణి రాసమణి తలవంచుకొని కూర్చుంది. రామక్రిష్ణుడు వెళ్ళి రెండు చెంపలు కొట్టాడు. Hot పకోడాలుగా యిచ్చేశాడు. చెంపలపై కొట్టేటప్పటికి అందరూ చాలా ఆశ్చర్యపడ్డారు. ఏమిటి రామకృష్ణుడు పిచ్చివాడు పిచ్చివాడు అనుకుంటున్నారు. నిజంగా ఈనాడు పిచ్చి వచ్చిందో ఏమిటో అమావాస్యనో, పౌర్ణమనో. పిచ్చి ప్రబలమై పోయింది. రాణిని, ఈ temple అధికారిణిని యింత మందిలో అవమానంగా కొట్టాడే అని చాలా అపోహలకు గురయ్యారు. చెంపలకు కొట్టిందే కాకుండా పబ్లిక్‌లో చెబుతూ వచ్చాడు ప్రజలారా! నేను రాణి రాసమణిని కొట్టటం చాలా తప్పుగా భావిస్తున్నారు. ఇక్కడకు మీరు ఎందుకోసం వచ్చారు. నా ప్రబోధలు వినటం కోసం వచ్చారు. విని నడచుకొంటే నడచుకోవచ్చు లేకపోతే పోవచ్చును.

sri sathyasai vahini

వినటం వినాలి కదా! ఇక్కడ ఉండి నీవు వినకపోయినప్పుడు ప్రయోజనం ఏమిటి? ఆ వినటానికి యిష్టం లేనప్పుడు యింటిలో కూర్చో సంతోషమే. ఈ రాసమణి రాణి కోర్టు సమాచారమంతా చింతిస్తున్నాది యిక్కడకు వచ్చి. కోర్టు విషయాలు చింతించటానికి యిక్కడకు ఎందుకు రావాలి. నా ప్రబోధనలలో యిలాంటి చింతలు చేసేవారు ప్రవేశించటానికి వీలు లేదన్నాడు. అందులో అందరికి ఆదర్శప్రాయంగా ఉండవలసిన రాణిగారు ఈమె తప్పు మార్గాన్ని చూపిస్తున్నాది. ఇది నాకు సరిపోటం లేదు అన్నాడు. అప్పుడు రాణి రాసమణి లేచి! ప్రభూజీ! నాది తప్పే. ఆ కోర్టు విషయాన్నే చింతిస్తూన్నాను. ఇకపైన నేను అన్యథా చింతించను. సర్వము తమకు అర్పితం చేస్తాను క్షమించండి అని కోరింది. ఈనాడు ఆధునిక యుగమందు అనేకమంది ప్రసంగాలకు వెడుతుంటారు, వింటుంటారు. ఆహా! ఎంత బాగుంటున్నాది ప్రసంగము అంటుంటారు. ఇంత బాగా ఉంటే ఎందుకు నీవు తినకూడదు విన్నావు. విన్నది తినాలి. తిన్నది జీర్ణము చేసుకోవాలి. అనగా ఆచరణలో పెట్టాలి. కానీ యిది అజీర్ణ వ్యాదిగా రూపొందుతున్నాది. ఇదే వాల్మీకి రామాయణంలో చక్కగా వర్ణిస్తూవచ్చాడు. రాముడు 64 విద్యలు నేర్చాడు. అవే విద్యలు రావణుడు కూడా నేర్చాడు. రావణుడు, రాముడు చదివిన విద్యలు సమానమే. కానీ చదివిన చదువులు ప్రతీ ఒక్క పదము రాముడు ఆచరణలో పెడుతూ వచ్చాడు. “సత్యంబ్రూయాత్, ప్రియంబ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం” అనే దాన్ని సాధించుకుంటూ వచ్చాడు. నేను చెప్పినది కాదు సత్యము. నాతండ్రి చెప్పిన సత్యమును నేను పాటిస్తున్నాను. నేను ఆదర్శవంతమైన విద్యార్థిని. నా తండ్రికి ఆదర్శంగా నిరూపించాలని తాను చెప్పిన మాటలను తాను నడచుకొనే తండ్రికి చూపిస్తూ వచ్చాడు. కనుక రాముడిని పవిత్రమైన ఆదర్శ మానవుడుగా నిరూపించాడు వాల్మీకి. కానీ రావణుని మూర్ఖా అన్నాడు. ఎందుకు మూర్ఖుడయ్యాడు. తిన్నాడు ఈ చదువునంతా కానీ జీర్ణం చేసుకోలేదు. అతనికి అజీర్ణ వ్యాధి ప్రారంభమైంది. కనుక అపవిత్రమైన మార్గములో ప్రవేశిస్తున్నాడు. కనుక అతనిని మూర్ఖుడు అన్నాడు. చదివిన చదువులు ఆచరణలో పెట్టకుండిన మూర్ఖుడనే చెప్పవచ్చును. ఎవరు ఆచరణలో పెడతారో వాడే నిజమైన చదువరి. అదే నిజమైన విద్యకు సరైన భూషణం. విద్యా వినయ సంపన్నే. విద్యనంతా సరైన మార్గములో ఆచరణలో పెట్టాలి.

sri sathyasai vachanamrutam

ఈనాడు సమాజము ఎన్ని రకములైన అవస్థలకో గురౌతున్నాది. ఎన్ని విధములైన అల్లకల్లోలములో చెలరేగుతున్నవి. కానీ యీనాటి విద్యార్థులైన మీరందరు ఈ సమాజంలో ప్రవేశించి, సత్యమార్గములో నిల్చి, ధర్మమును ఆచరించెడి ఆదర్శమైన వ్యక్తులుగా తయారుకావాలి. అదియే నేను కోరేది. నాకు ఏదీ మీనుంచి అక్కరలేదు. నేను దేనిని మీ నుంచి ఆశించలేదు. ఆశించేది ఒక్కటే. చదివిన చదువు ఆచరణలో పెట్టి యితరులకు ఆదర్శంగా అందించండి. **"సర్వే లోక హితేరతాః".** లోకాన్నంతా హితంగా చేయాలి. ఎవరిని ద్వేషించకూడదు. ఆవిధమైన తత్వాన్ని మీరందరు అనుసరిస్తూ రావాలి. **"సర్వే సముదితా గుణైః"** మంచి సద్గుణములు కల్గినవారుగా ఉండాలి. కానీ ఈనాడు దుష్ఫలములు ఆశిస్తున్నాడు. దుష్కర్మలు చేస్తున్నాడు.

**పుణ్యస్య ఫల మిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవః**
**న పాపఫల మిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః**

నాకు పుణ్యఫలము కావాలని ఆశిస్తున్నాడు. కానీ పుణ్య కార్యానికి ముందంజ వేయటం లేదు. నాకు పాపఫలం వద్దు వద్దు అంటున్నాడు. కానీ పాప కార్యములు చేయటానికి ముందంజ వేస్తున్నాడు. వద్దన్నది నీవు ఎందుకు చేయాలి. కావాలని కోరినదానికి ఎందుకు నీవు ఆచరించకూడదు. కనుక కావాలని ఆశించినప్పుడు నీవు ముందంజ వేయి. ఆచరించు, ఆనందించు, పదిమందికి పంచు. అదే నీ కర్తవ్యము. ఈవిధమైన దివ్యమైన భావాలు హృదయములో మార్పు తెచ్చుకొని, నిరంతరము పాదచింతన చేస్తుంటే పవిత్రమైన భావములు ఆవిర్భవిస్తూ వస్తుంటాయి. గోపికలకు కృష్ణుడంటే చాలా ప్రీతి. అంత ప్రేమలో ఉండినప్పటికిని కృష్ణుని పట్టాలంటే ఏమి చేయాలి? తాడు తీసుకురావాలా? దేనితోనైనా మనం పట్టవచ్చునా అని యోచన చేస్తూ వచ్చారు. నిత్యము వారి యిండ్లకు వస్తున్నాడు. పాలు త్రాగుతున్నాడు. తన స్నేహితులకు పోస్తున్నాడు. మిగిలిన పాలు క్రింద పోసి పరుగెత్తి పోతున్నాడు. ఎవరికి చిక్కటం లేదే యితను. తల్లి దగ్గరకు పోయి కంప్లైంటు చేశారు. అమ్మా నీ కుమారుడు మాయింటికి వచ్చి అల్లోకల్లోలములు పుట్టిస్తున్నాడు. కేవలం మేమే త్రాగినామని మా అత్తలంతా కోప్పడుతున్నారు. కానీ కుమారుడు చేసే పనులు మాకు బాధాకరంగా ఉన్నాయని బాధపడుతున్నారు. తల్లి కూడా చూచింది.

srisathyasaivechanamrutam

**నోరంత వెన్న వాసన ఊరంతయు ఆగడంబు**
**ఒక్కటే రద్దులు గోరంత లేవు బాలా**

నీవు చిన్నవాడవు. గోరంత లేవు కానీ యిలాంటి పెద్ద పనులంతా నీవు ఎందుకు చేస్తున్నావు? ఎందుకు ఊరంతా గలాటా చేస్తున్నావు. భర్తలు కొట్టటం అత్తలు తిట్టటం ఈవిధంగా కోడళ్లను అవస్థలపాలు చేస్తున్నావు. దీనినే చూచాడు ఉద్ధవుడు. కృష్ణుని దగ్గరకు పోయి చెబుతున్నాడు.

**అత్తలు మొత్తుకొన్న మరి భర్తలు కత్తులు నూరుచున్న**
**నోరెత్తరు కోపగించరు ఎటకేగరు భీతిలబోరు గోపికల్**
**పొత్తములందు చిత్తరువుల బొమ్మల రీతిగనుండే వారిలో కృష్ణుడు**

paper లో ప్రింటు ఎట్లా అయిందో ఆవిధంగా వారి హృదయాల్లో కృష్ణుని రూపం ప్రింటు అయిపోయింది. ఆ ప్రింటును వేరు చేయటం, పేపరు వేరు చేయటం సాధ్యం కాదు. వారి హృదయాల్లో ప్రింటు అయిపోయాడు కృష్ణుడు. అప్పుడు ఉద్ధవునికి చెప్పాడు పిచ్చివాడా గోపికలకు బుద్ధి చెబుతానని పోయావే, నీవు నేర్చుకొని వచ్చావా అన్నాడు. వారు నిరంతరము కృష్ణ చింత తప్ప అన్యచింతలో ప్రవేశించే వారు కాదు. గోపికలు ఒకసారి వచ్చారు. గురకపెడుతూ ఉన్నట్టు కనిపించాడు. అప్పుడు గోపికలు చెబుతున్నారు.

**మేనుమరచి నిద్రించేవారు మేలుకొలుపగలరు ఎవరైనా!**
**కనులు మూసుకొని నిదుర నటించే ఘనుని లేపగా ఎవరితరము**
**జాలమేలోయి కృష్ణా లీలలు చాలోయి**

కావాలని నిదురించే వారిని లేపుటకు ఎవరితరము. మా తరం కాదు. నీవు నిద్రపోతే ప్రపంచమంతా నిద్రపోతుంది. నీకు నిద్రయే లేదు. ఆ సత్యము మాకు తెలుసు. ఈ రహస్యమంతా మాకు తెలుసు కాబట్టి నీవేమి చేసినా వినేవారం కాదన్నారు. సత్యమెరిగిన గోపికలు ఆనాటి గోపికలు. అన్నింటియందు కృష్ణుని సత్యమును గుర్తించి వర్తించిన వారు. దీన్ని కనుగొన్న వారు ఎవ్వరూ ఈ జగత్తులోనే లేరు.

**నిను కనుగొనగలమా కృష్ణా! నిను కనుగొనగలమా**

srisathyasaivachanamrutam

**అణువుకంటె అతి సూక్ష్మ రూపుడవు**
**ఘనము కంటె అతి ఘననీయుడవు**
**ఎనుబది నాలుగు లక్షజీవముల అనయంబున**
**ఎడబాయ కుందువట**
**అణువు మొదలు తృణకాష్టము వరకు**
**అఖండ రూపుడవై వెలయుదువు ॥నిను॥**

ఎవరు తెల్సుకుంటారు నీ యొక్క రూపము? ఎవరు అర్థం చేసుకుంటారు నీ లీలలు? ఎవ్వరి తరమూ కాదు. కాబట్టి నీ లీలలు కట్టిపెట్టు. మాకు ఆనందాన్ని అందించు. నీవు ఆనందాన్ని అనుభవించు. ఆనందములో ఏకమై పోయినపుడు దివ్యత్వములో ఏకత్వమును మేము అనుభవిస్తాము. నీవు వేరు, మేము వేరుగా మేము యింక నిలుపలేము. ఇది సాధ్యం కాదు. నీవిట్లు చేయటానికి వీలు కాదు. నీవు భక్త పరాధీనుడవు. అలాంటి ఆధీనుడవైన నీవు మమ్మల్ని యీ విధంగా శోధించటం మంచిది కాదు అన్నారు. కనుకనే గోపికలకి యిచ్చిన మాటను సత్యంగా నిరూపిస్తూ వచ్చాడు కృష్ణుడు. అందునా రాధకు ప్రత్యేకంగా యిచ్చిన మాట. ఆమె కట్టకడపటికి ప్రాణం విడిచేముందు, పొదలలోపల కూర్చుంది యమునా తీరములో. బాధపడుతున్నది ఏవిధంగా నేను కృష్ణుడిని చూడాలి అని. నేనింక దూరమైపోతున్నాను. ఈ శరీరాన్ని త్యజిస్తున్నాను. ఇలాంటి పరిస్థితిలో ఒక్కసారి కృష్ణా నీవు దర్శనమివ్వకూడదా అని ప్రార్థిస్తున్నది.

**పాటపాడుతూ కృష్ణా పలుకు తేనెలొలుకు నటుల**
**మాటలాడుమా ముకుంద మనసు తీరగా ॥పాట॥**
**వేదసారమంత తీసి నాద బ్రహ్మముగను మార్చి**
**వేణు వందు తిరుగబోసి గానరూపముగ మార్చి ॥పాట॥**

ఈ వేణువు అనే దానిలో తిరుగబోసి, తిరిగి నీవు గానంగా మార్చివేయి. అది నేనొక్కసారి వినాలి అన్నది. తిరిగి కృష్ణుడు అక్కడికి వచ్చాడు. ఆమె అభీష్టానుసారంగా తాను వేణువును వాయించాడు. ఆ వాయిస్తూ వుండగానే రాధ ప్రాణం వదలింది. ఆ జ్యోతి కృష్ణుడిలో ప్రవేశించింది. ఆనాడు వదలినటువంటి వేణువును తిరిగి కృష్ణుడు పట్టలేదు. ఇంక మరి

sri sathyasai vacharamrutam

వేణువునే పట్టలేదు. ఇది సత్యమైన వాక్కు. ప్రతీ అవతారం కూడా సత్యాన్ని పాటించడానికి సాక్షాత్కరించిన అవతారాలు. ఎవరు మరచినప్పటికినీ తన సత్యాన్ని తాను మరవడు భగవంతుడు. ఎలాంటి పరిస్థితిలోనైనా తన సత్యాన్ని తాను మరవడు. కనుకనే రాధకిచ్చిన మాటతో ఆనాటినుండీ వేణువు నిలిపివేశాడు. ఈ డ్రామాల్లో, సినిమాల్లో కృష్ణుడు వేణువుతో వుంటాడు కాని నిజంగా చూస్తే ఆనాడు రాధ ప్రాణం విడిచిన తర్వాత కృష్ణుడు వేణువునే ముట్టలేదు.రాధ ఎవరు? ఏదో ఒక స్త్రీగా భావించి, ఆమెను అనేకరకములుగా భావించి, ఏదో అపశృతులు పలుకుతున్నారు. ఆమె స్త్రీ అని కాని, పురుషుడని కాని ఏమాత్రం బేధం లేదు దేహాభిమానమే ఆమెకు లేదు. అందుకే రాధ - ధరా. ఈ ప్రకృతే రాధగా పుట్టింది. ఆ ధరనే నిజమైన ఆధారంగా నిలచిపోయింది లోకానికి. ఇదియే రాధ-Radha. R నుంచి ప్రారంభమైనపుడు Radha అయిపోతుంది. A నుండి ప్రారంభమైనపుడు ADHAR అయిపోతుంది. D నుండి ప్రారంభమైనపుడు DHARA అవుతుంది. ఇది A నుండి ప్రారంభమైనపుడు ADHAR అయిపోతుంది. రాధకు ఆధారం ఆరాధన. అదే రాధ. ధార ఆరాధనే రాధ. ఎప్పుడు చూచినా సర్వకాల సర్వావస్థలయందు భగవంతుని నామస్మరణే. అదియే రాధ. ఏక్షణమునందైననూ వదలినటు వంటిది కాదు రాధ. నిద్రావస్థయందు కూడా తాను కృష్ణా కృష్ణా యని స్మరించేది. కనుకనే భగవంతుని భక్తి ప్రపత్తులనగా, ఆవిధంగా అనాది కాలమునుండి భారతదేశంలో యింత పవిత్రమైన ఆదర్శాలు అందిస్తూవచ్చారు.

కనుక మీరు కూడా యీనాడు కృష్ణుని పాదములను గట్టిగా పట్టుకోండి. గోపికలందరూ కృష్ణుడిని ఎలాగైనా యీనాటు పట్టుపట్టి తీరాలి అని ఒక meeting లో నిర్ణయించుకొన్నారు. నాల్గువైపులా కాచుకున్నారు. ఈ సంగతి తెల్సిన కృష్ణుడు చక్కగా దానికి తగిన ఆధారంగా నిరూపిస్తూ వచ్చాడు. మనసెరిగిన మాధవుడు. మర్మమెరిగిన మాధవుడు పాలు అంతా క్రింద పోశాడు. ఆ పాలల్లో పాదములంతా చక్కగా తడిపాడు. గోపికలంతా యింక చిక్కినాడురా అని పరుగెత్తి వచ్చేసరికి, పాలు విడచి పారిపోయాడు. ఎక్కడికి పోయాడో కన్పించలేదు. ఒక్క క్షణంలో అంతర్ధానమై పోయాడు. అప్పుడు గోపికలంతా ఆ పాదముల యొక్క గుర్తులను ఆధారం చేసుకుని వెళ్ళారు. కృష్ణుడు ఒక

sri sathyasai vahini.org

రూములో చిక్కాడు. అనగా భగవంతుని పాదములు వశం చేసుకున్నపుడు అతను సులభంగా వశం అవుతాడు. కనుక భగవంతుని పాదములను ఆశ్రయించిన వారికి ఎట్టి అపరాధములు ఉండవు. ఎట్టి పాపములు ఉండవు. ఎట్టి దుఃఖములుండవు. అనగా పవిత్రమైన భక్తితో భగవంతుని పాదములు ఆశ్రయించి, భగవంతుని పాదములు చింతిస్తూ యున్నపుడు ఎవ్వరికీ ఏవిధమైన కోరికలు రానక్కర లేదు. నిన్న డా॥ గాడియా చెప్పాడు. పాదములు పూజ చేసినపుడు పెండ్లి కాని వారికి పెండ్లి అయింది, పిల్లలు లేనివారికి పిల్లలు అయినారు అని. ఇదా మనకు కావల్సినవి. ఇవి కాదు కావల్సింది మనకు. ఏ రకమైన చింతలు లేకుండాపోతుంది. ఇవన్నీ లౌకిక సంబంధమైన ఫలితాలు. ఇదంతా భౌతికమైన ఫలితాలు. ఇవంతా ప్రాకృతమైన ఫలితాలు. మనము పాదముల నాశ్రయించేది దీని కోసం కాదు. నివృత్తి సంబంధమైన ఆత్మసంబంధానికి. పెద్ద పెద్దవే మనకు లభ్యమయినపుడు, చిన్నచిన్నవంతా మనకెందుకు? గులకరాళ్ళంతా ఎందుకు? మేరు పర్వతాన్నే పట్టాలి. దానిని మనం పట్టాలి. అదియే దైవపాదం.

ఒకానొక సమయంలో విష్ణువు దగ్గరకు జయ విజయులు వెళ్ళారుట. సేవకులుగానే వున్నారు. ఏదో కాలం చిక్కినది కదా అని ప్రశ్న వేస్తూ వచ్చారు. స్వామీ! మీరు యీ కనకపర్వతాన్ని సృష్టించారు. ఎందుకోసం సృష్టించారు? ఆశ లేనివానికి కనకదుర్గం కూడా వానికి అవసరం లేదు. ఆశ ఉన్నవానికి యీ కనకదుర్గాలు నూరు సృష్టించినా కాని తీరదు వాని ఆశ. కనుక ఈ desires ఉన్నవానికి ఏమిచ్చినా desires తగ్గవు. వాడు చాలా బీదవాడు. A man with dual mind is half blind. ఇన్ని ఆశలు యున్నవానికి ఏవిధంగా తృప్తి కల్గుతుంది. ఎవరికి తృప్తి లభిస్తుంది. Who is a rich man? He Who has got much satisfaction. He who has much desires is the poorest man. కనుక ఆ desires లేకుండా ఉండేదానికి చూపించేందుకే భగవంతుడు అవతరించింది.

భగవంతునికి ఏమాత్రం desires లేవు. అతని చింతన ఒక్కటే. భక్తుల యొక్క చింతనే. భక్తులు బాగుపడాలి. భక్తులు మంచి మార్గంలో ప్రవేశించాలి. సమాజాన్ని సరియైన అభివృద్ధికి తెప్పించాలి. ఈ సొసైటీ యొక్క క్షేమాన్ని నా క్షేమంగా మీరు భావించాలి. నేను, నా కుటుంబము అనే స్వార్థంలో మునిగిపోరాదు. ఈ స్వార్థ

srisathyasaivachanamrutam

స్వప్రయోజనాలతో జీవించకూడదు. పవిత్రమైన విశాలమైన హృదయంగా మనం అభివృద్ధి పరచుకోవాలి. ప్రపంచము, సముద్రము ఎంత విశాలమయినవో నీ హృదయం కూడా అంత విశాలంగా పెంచుకోవాలి. అంతేకాని భగవంతునికి అర్పితము చేశామని, ఈ narrow mind పెట్టుకుంటే ఏమి ప్రయోజనం? కనుక మీరు విశాలమైన హృదయంగా పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలి. ఈ లౌకికమైన వాంఛలకే మాత్రం అవకాశం యివ్వరాదు. దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన వాంఛల అభివృద్ధికి అవకాశం యివ్వాలి. లోక క్షేమానికి తగిన సేవలు చేయాలి. లోకస్సమస్తా సుఖినోభవంతు అనే దానిని నెరవేర్చుటకు పూనుకోవాలి. అప్పుడే మీ సాధన సరియైన సాధనగా యుంటుంది. లోకంలో యింతమంది భక్తులుంటున్నారు. ఎందుకిన్ని కష్టములు లోకంలో రావాలి? ఇది సరియైన భక్తి కాదు. ఈ భక్తి పూర్తిగా అర్పితం గావించిన భక్తిగా వుండాలి. ఈ అర్పితంగాకుండా అర్చనలో మీరు పడిపోతున్నారు. అర్చనకంటే అర్పితం చాలా ప్రధానమైనది. అప్పుడే దేవుడు, నీవు ఒక్కటై పోతావు. జీవుడు, దేవుడు ఏకత్వాన్ని పొందే దివ్యతత్వమే ఈ ఆధ్యాత్మిక పాదతత్వము. కనుక మీరు ప్రతి ఒక్క విషయమునందు ప్రపంచ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, సమాజ సౌభాగ్యాన్ని ఆశించి, నా నుండి యీ సమాజానికి ఏ సేవ అవసరం అనే విచారణ చేయాలి.

## "Duty, Devotion, Discipline"

విద్యార్థులారా! మీరు కూడా ఏ చదువు చదివితే ఏ ఉద్యోగం లభ్యమవు తుంది అని ఉద్యోగ నిమిత్తమయి విచారణ చేయకండి. నేను ఏవిధంగా యీ సమాజానికి సహాయకారిగా వుండాలి. నానుండి సమాజానికి కావల్సిన అవసరం ఏమిటి? అని దీనిని మీరు చింతిస్తూ పోవాలి. అప్పుడే దేశోద్ధారకులుగా మీరు తయారవుతారు. దేశము యొక్క సౌభాగ్యాన్ని ఆశించినవారవుతారు. దేశ క్షేమంతో పాటు నీ కుటుంబక్షేమం కూడా అభివృద్ధి అవుతుంది. కనుక దేశోద్ధారణ నిమిత్తమై ఉద్భవించామనే భావాన్ని మీలో అభివృద్ధిపరచుకోవాలి. ఈ చదువులంతా ఎందుకోసం చదివారు? ఈ చదువులన్నీ దేశోద్ధారణ నిమిత్తమయి కావాలి. కానీ యీనాడు చదువుతున్నారు. ఎక్కడ మర్చిపోతున్నారో ఏమో?

sri sathyasai vahanamrutam

**ఆల్జీబ్రాయంత అరయ చూచునుగాని**
**ఇంటి వైశాల్యము నెరుగ లేరు**
**అనుదినంబును డ్రిల్లు అనుసరింతురు కాని**
**పద్మాసనము వేయ బాధపడును.**

ఈ డ్రిల్లు చేసి ఏమి ప్రయోజనము? డ్రిల్లు చేస్తున్నారు. కాని పద్మాసనం వేసి కూర్చోలేరు. ఈ డ్రిల్లునంతా ఎందుకు? ఏమి ఉపయోగం లేనిది. కనుక మనం చేసినదంతా మన నిత్య జీవితంలో నిరూపించాలి.

ప్రేమస్వరూపులైన భక్తులారా! ఈ నాల్గు దినములు మీకు నాల్గు నిమిషములుగా జరిగిపోయింది. నిజముగా మీ నుండి యిక్కడ నేర్చుకోవలసింది డిసిప్లిన్. అన్ని దేశముల నుండి వచ్చారు. అనేక విధములయిన functions పెట్టుకున్నారు. Last year China నుండి వచ్చి యిక్కడ New Year జరుపుకున్నారు. ఇంక ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చారు, పాదపూజలు చేశారు. ఇంకా అనేక రాష్ట్రాలనుండి వచ్చి యిక్కడ అనేక functions అంతా జరుపుకుంటున్నారు. కాని ఒక్కటి నాకు సంతోషం. ఈ మద్రాస్ నుండి వచ్చినవారు వారి కార్యక్రమం systematic గా చక్కగా జరుపుతూ వచ్చారు. వారి డిసిప్లిన్ కూడా చాలా ఆదర్శవంతమైన డిసిప్లిన్‌గా నిరూపించారు. ఆ సుబ్రహ్మణ్య శెట్టి వయస్సు వచ్చినవాడు. కాని అట్టి పెద్ద వయస్సులో యున్నప్పటికీ, ఒక్కమాట మీద అందరూ కట్టుబడి యింత సాధన సల్పుతూ వచ్చారు. దీనికొక సంఘము సమావేశము అనేది లేదు. ఎవరికి వారే వారి హృదయం నుండి ఆవిర్భవింప చేసుకుని, ఒకటే డిసిప్లిన్ వారు పోషిస్తూ వచ్చారు. ఈ డిసిప్లిన్ ఎక్కడికి వెళ్ళినా మీరు కాపాడుతూ పోవాలి. కాని మధుర పాదపూజ ట్రస్ట్ మంచి డిసిప్లిన్ కోసం పాటుపడుతున్నది. ఇక్కడే కాకుండా ఎక్కడికి పోయినా యీ డిసిప్లిన్ మీరు అనుసరిస్తూ రావాలి. సత్యసాయిసంస్థల ప్రధాన అంశములు మూడు యుంటున్నాయి. Devotion, duty, discipline. ఈ మూడింటి డకార తత్వమును మీరు కాపాడుతూ రావాలి. మీ duty మీరు చేయాలి. మీ devotion ఏ మాత్రం చలించకుండా చూసుకోవాలి. చూశారా! మూడు 'D' ల తత్వము చక్కగా అనుసరించినపుడే శాశ్వతమైన ఆనందాన్ని మీరు అనుభవించగలరు.

sri sathyasai vachanamrutam

Duty, devotion, discipline ఈ మూడింటి యొక్క తత్వంతో మన జీవితం ముడిపడిపోవాలి. ఈవిధంగా జీవితాన్ని అభివృద్ధి పరచుకుని మీ తరతరములకూ కూడా, మీ కుమారులకు, మీ మనుమలకు యిలాంటి సాంప్రదాయాన్ని అందిస్తూ రావాలి. మీతోపాటు దీనిని అంత్యము గావించరాదు. దీనిని కంటిన్యూ చేయాలి. అన్ని జన్మలకూ ఈ సంప్రదాయం పాటించాలి. ఎలాంటి పరిస్థితిలోనైనా దైవనామాన్ని మరవకూడదు. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి ఈ మూడింటి యొక్క తత్వాన్ని విచారణ చేయాలి.

Love for God, Fear of Sin, Morality in Society. ఈ సొసైటీలో యీ మొరాలిటీ లేకుంటే ప్రయోజనం ఏమిటి?

కనుక మీ జీవితాన్ని ధన్యంగావించుకుని, ఆదర్శవంతమైన జీవితాన్ని అందించి, దివ్యమైన ఆత్మతత్వాన్ని అనుభవించండి.

**(తేదీ 12-10-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam